పార్క్ నిర్మాణానికి భూమిపూజ

పార్క్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 4 : ఆదిలాబాద్ పట్టణ శివారులోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం, ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే దిశగా మున్సిపల్ సౌజన్యంతో రూ.20 లక్షలతో పార్క్ నిర్మాణం చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బుధవారం పార్క్ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం అయ్యప్ప స్వామిని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. అలాగే అన్నదాన ప్రసాదాన్ని భక్తులతో కలిసి సేకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాయి ప్రణయ్, అశోక్‌స్వామి, వెంకన్న, ప్రకాశ్, ఆలయ కమిటీ సభ్యులు సూర్యకాంత్, రవీందర్, లక్ష్మణ్, సాయికృష్ణ, నరేశ్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్, అక్టోబర్ 4 : గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్ సూచించారు. ఉట్నూర్‌లోని కుమ్రం భీం కాంప్లెక్స్ మైదానంలో బుధవారం నిర్వహించిన ఆశ్రమ పాఠశాలల జోనల్ స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాల విద్యార్థులు ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటడం ఆదర్శమన్నారు. ఆసియా క్రీడల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో చదివిన నందిని అథ్లెటిక్స్ భారత్‌కు ఆడడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్‌లో ఆశ్రమ పాఠశాలల గిరిజన విద్యార్థులు సైతం ఆస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీడీ ఎం దిలీప్‌కుమార్, ఏపీవో ఆత్రం భాస్కర్, డీటీడీవో అంబాజీ, గిరిజన క్రీడల అధికారులు కోరెడ్డి పార్థసారథి, రమేశ్, ఏసీఎంవోలు జగన్, శివాజీ, ఏటీడీవోలు క్రాంతికుమార్, నిహారిక, అమిత్, పీడీలు హేమంత్, దేవ్‌రావ్, శంకర్, ఉత్తమ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నీతి ఆయోగ్‌కు నార్నూర్ మండలం ఎంపిక

మాట్లాడుతున్న ఐసీడీఎస్ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మిల్కా

నార్నూర్, అక్టోబర్ 4 : నీతి ఆయోగ్‌కు నార్నూర్ మండలం ఎంపిక కావడం హర్షణీయమని ఐసీడీఎస్ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మిల్కా అన్నారు. నీతి ఆయోగ్‌లో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన సంకల్ప సప్తాహ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారుల భాగస్వామ్యంతో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫలాలను ఐసీడీఎస్ అధికారులు నిత్యం అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించేలా టీచర్లు కృషి చేస్తున్నారన్నారు. ప్రధానంగా రక్తహీనత నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా నార్నూర్ మండలాన్ని ముందు ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, ఎంపీడీవో రమేశ్, ఐసీడీఎస్ సీడీపీవో శారద, వ్యవసాయ అధికారి గిత్తే రమేశ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుభాని, సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ సురేశ్, బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ సుభాష్, సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సూర్యవంశీ, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు, కూరగాయలతో త్రివర్ణ పతాకం

అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలతో త్రివర్ణ పతకంతో కార్యకర్త, పిల్లలు

ఎదులాపురం, అక్టోబర్ 4 : పోషక పదార్థాలపై అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో పోషణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్‌లోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం నంబర్-1లో టీచర్ రాధ చేపట్టిన కార్యక్రమం ఆకట్టుకుంది. చిరుధాన్యాలు, కూరగాయలతో త్రివర్ణ పతాకం, బతుకమ్మ, భోజనాల చిత్రాలు, పప్పుదినుసులతో పోషణ మహా అని అక్షరాలను పిల్లలతో వేయించి వారికి అవగాహన కల్పించారు.

సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలి

నార్నూర్, అక్టోబర్ 4 : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు రక్తహీనతకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పోషణ్ మహోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారానికి సంబంధించిన ప్రదర్శన నిర్వహించగా ఐసీడీఎస్ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మిల్కా, మండల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తిలకించారు. గర్భిణులకు సీమంతంతో పాటు చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కావల రమేశ్, ఐసీడీఎస్ సీడీపీవో శారద, సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ సురేశ్, కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ సుభాష్, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సూర్యవంశీ అనిల్, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రం కోసం స్లాట్‌బుక్ చేసుకోవాలి

ఎదులాపురం, అక్టోబర్ 4 : జిల్లాలోని దివ్యాంగ ధ్రువీకరణ పత్రం పొందుటకు మీ సేవ కేంద్రంలో స్లాట్‌బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్‌బుక్ చేసుకొని నిర్ణీత తేదీలో రిమ్స్ వైద్యులను సంప్రదించాలన్నారు. గతంలో పొందిన సర్టిఫికెట్ల కాలపరిమితి పూర్తయిన వారు రెన్యూవల్, కొత్త సర్టిఫికెట్ పొందుటకు ఈ నెలలోపు మీ సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న వారు తేదీలో సదరం క్యాంపునకు తప్పకుండా హాజరై ధ్రువీకరణ పత్రం పొందాలన్నారు.

పింఛన్ సమస్య కోసం టోల్ ఫ్రీ నంబర్

ఎదులాపురం, అక్టోబర్ 4 : జిల్లాలోని ఆసరా పింఛన్‌దారుల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 8186000940 సంప్రదించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగుల, బీడీ, చేనేత, గీతకార్మికుల పింఛన్‌దారులు సమస్యలు ఉంటే ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

నేడు జైనథ్‌లో ఎమ్మెల్యే పర్యటన

జైనథ్, అక్టోబర్ 4 : మండలంలోఈ నెల 5వ తేదీన ఆదిలబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఉదయం 10 గంటలకు బతుకమ్మ చీరెలు, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు హాజరు కావాలని కోరారు.

విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న సమితి అధ్యక్షుడు బాల శంకర్ కృష్ణ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 4: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆదిలాబాద్‌లో 24 అడుగుల స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని యువజన సంఘాల సమితి అధ్యక్షుడు బాల శంకర్ కృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగు రామన్న హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవిలతో దాడి

ఎదులాపురం, అక్టోబర్ 4 : ఆదిలాబాద్‌లోని పంజాబ్‌చౌక్‌లో మంగళవారం అర్ధరాత్రి గుట్కా సరఫరాదారులపై దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఈ విషయంలో వన్ టౌన్ సీఐ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర సార్‌కానీకి చెందిన సమర్ ఫజలని, సయ్యద్‌వాజిద్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్‌కే షారుఖ్, సమీ ఉల్లాఖాన్‌తో ఆర్థిక లావాదేవిలు ఉన్నాయి. ఇదే క్రమంలో మంగళవారం రాత్రి ఇరువురు గొడవపడ్డారు. సమర్ ఫజలని, సయ్యద్ వాజిద్‌పై దాడి చేసి కారును ధ్వంసం చేశారు. ఇద్దరికి గాయాలు కావడంతో రిమ్స్‌కు తరలించారు. ఈ దాడిలో ఎస్‌కే షారుఖ్, సమీర్‌ఉల్లాఖాన్, భూషణ్ త్రిపఠీ, ఫసీ, రాజు, కిష్టు, సమీర్, జిషాన్, కలీంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

ఆర్మీ జవాన్ సేవలు మరువలేనివి

తాంసి, అక్టోబర్ 4 : దేశం కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఆర్మీ జవాన్ల సేవలు మరువలేనివని వైస్ ఎంపీపీ ముచ్చ రేఖారఘు అన్నారు. పొన్నారి గ్రామంలో అమరవీర ఆర్మీ జవాన్ నవీన్ విగ్రహానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశానికి ఆర్మీ జవాన్ నవీన్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాల పిల్లలతోపాటు గ్రామస్తులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అండె అశోక్, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, దాసరి స్వామి, ఉప సర్పంచ్ నరేందర్ రెడ్డి, నాయకులు దేవేందర్, రమణ, విలాస్, రామన్న, సంజీవ్, ప్రతాప్, ప్రవీణ్, అశోక్ పాల్గొన్నారు

గ్రామాలకు బతుకమ్మ చీరలు చేరవేత

జైనథ్, అక్టోబర్ 4: మండలానికి 18,842 బతుకమ్మ చీరలు వచ్చాయని ఐకేపీ ఏపీఎం భగవాండ్లు తెలిపారు. అందులో 6 మీటర్ల చీరలు 17,852, 9 మీటర్ల చీరలు 990 రాగా గ్రామాల వారీగా బుధవారం అకిటెన్స్‌తో సహా చేరవేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీలు శ్రీనివాస్ రెడ్డి, నాందేవ్, గంగారాం, లక్ష్మి, ఏవోఏ రామన్న పాల్గొన్నారు.

ఆటోల ద్వారా గ్రామాలకు బతుకమ్మ చీరలు తరలిస్తున్న ఐకేపీ సిబ్బంది

ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులను కలిసిన ఎమ్మెల్యే

నార్నూర్,అక్టోబర్4: హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో పరిశ్రమల శాఖ భవనంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన రేణికుంట ప్రవీణ్, కే నీలాదేవిని బుధవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఆసిఫాబాద్ జిల్లా కోఆప్షన్ సభ్యుడు అబూతలిబ్, గాదిగూడ వైస్ఎంపీపీ యోగేశ్ ఉన్నారు.

ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యురాలికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు